# పారిపోవద్దు

తార్రోడ్డు నల్లగా పొడవాటి తివాచిలాగుంది. నడుస్తుంటే సుఖం వుంది. ఆవదం రాసిన గుండులా నిగనిగలాడుతూ నున్నగా వుంది. అడుగేస్తే జారిపోయేట్టు వుంది. బతుకంతా ఎన్ని పాపాలు చేసినప్పటికీ పుణ్యాత్ముడి స్పర్శవల్ల ఏవీ అంటదన్నట్టుగా, అలాగే పడుకుని దొర్లినా బట్టకేవీ అంటదన్నట్టుగా వుందారోడ్డు.

చేతిలో ఎయిర్‌బేగు బరువుతో కూడా సుఖంగానే వుంది నడక. నేనిప్పుడు విడిచివస్తున్న ఊరితాలూకు ఆలోచనలు మాత్రమే వీపున గుచ్చుకుంటూ బాధపెడుతున్నాయి.

"మేస్టువయ్యుండి ఏటిలాటిపన్జేసేవు..." అంది ఆ మహాతల్లి పాపమ్మ.

పాపమ్మ నిటారుగా నిలబడితే ఆరున్నరడుగుల స్టీలు బీరువాలాగా వుంటుంది. బోర్లాపడుకుంటే సర్దాకి ఒత్తిగిల్లిన బుల్లెట్ బండిలాగుంటుంది. నిలబడకా, పడుకోకా మఠవేసుక్కూచుంటేమాత్రం మా ఊళ్ళోని నల్లరాతి కొండ గుట్టలాగుంటుంది.

"ఏటి మేస్టూ... మేస్టు పన్జేస్తున్నవుకదా ఏటీ పన్జేప్మీ..." అందావేళ.

నేనేదో ఘోరపాపం చేసినట్టు నిలదీసింది. నేన్జేసిన ఆ ఘోరపాపం ఏవిటంటే-ఆ తల్లి కూతుర్ని నేను ప్రేమించడం!

"ఏంజేసే పాపా.... ఏంటంటాడు మేస్టు...." వెనకే వచ్చిసేడు ఆ యమ్మమొగుడు.

"నేనేంజేసేను... మీ అమ్మాయిని ప్రేమించేను... పెళ్లి చేసుకుంటానన్నా..."

ధైర్యమంతా కూడదీసుకుని ఆ దంపతులికి సాధ్యమైనంత స్పష్టంగా క్లుప్తంగా చెప్పేను.

"అగ్గదే... నానూ అంటున్నాను.... ఏంటా కూతలూ అని...." అంది ఎడంచెయ్యి ఝూడిస్తూ బుర్ర కిందికీ మీదికీ ఆడిస్తూను.

"ఏంటేంటీ... మళ్ళీ కుయ్‌మీ..." అంటూ ఎడంచేతి దండ మీద చొక్కాని కుడిచేత్తో ఎత్తేడు పాపమ్మ మొగుడు.

బిత్తరపోయేన్నేను.

"కాదేంటి మేస్ట్రూ... పెళ్ళాడతావా.... నువ్వేంటి ఎస్టీవోడివనుకున్నావా... ఎమ్మెల్యే కొడుకువనుకున్నావా... మేస్ట్రూ ముండావోడివి..." అంది నన్ను నాకు గుర్తుచేస్తూ.

"ఓస్ మాలావు పెళ్ళికొడుకొచ్చినాడ్రా నా కూతురికి... పేవించేను పెల్లాడేస్తాననగానే పారొచ్చి కాల్లమీ దడిపోతాననుకున్నాడు గావాల మేస్ట్రు..." అని పాపమ్మ మొగుడూ....

"అమ్మ! మేస్ట్రునాకొడుకా.... ఎంత ప్లేనేసినావురా, మా డబ్బంతా ఒడిసేసుకుందారనీ... హమ్మ... హమ్మ..." అంటూ గుండె బాదుకుంటూ పాపమ్మ....

ఇంక నేనేం మాటాడతాను?

అప్పటికే నాలుగు గడపలమీద నలభయ్యేసిమంది గుమిగూడి గారడీ చూస్తున్నట్టు వినోదిస్తున్నారు. నాలుగురాటలూ, నాలుగు కమ్మల్తో పశువులశాలలావుండిన పాఠశాలని, సాయంత్రం చీకటిపడితే చాలు మూడుసీసాలూ ఆరుగళాసుల్తో పానశాలలా వుండిన పాఠశాలని పవిత్రస్థలంగా గుర్తింపజేసేను... మరంచేత వాళ్ళంతా అంత వరకూ మేస్టారు... మేస్టారు... అంటూ గౌరవం కనబరచిన వాళ్ళే.

ఆ జనం మధ్య నుండి చోటుచేసుకుంటూ ముందుకొచ్చేడు ప్రెసిడెంటు.

"ఏట్రా పెసిడేంటూ.... ఇప్పుడా రాడం....?" అంటూ పాపమ్మ మొగుడూ.....

"అవునుమరి... పెసిడెంటన్నియ్యింట్లో బాగోతవేటి... పరిగెట్టుకొచ్చి

తగూపడ్డానికి..." అంటూ నిష్టూరంగా పాపమ్మ...

ఊపిరిసలపలేదు ప్రెసిడెంటుకి.

ఊరిభోగట్టాలకి అన్న అనిపించుకుందావని వున్నప్పటికీ వయసుకి మాత్రం అనిపించుకునే వుద్దేశ్యం లేదతనికి. మరంచేత... "ఏట్లేద్దు పాపమ్మప్ప...నివ్వా నీనిస్టూరమ్మాట్లూను... అసల్సంగతేటో సెప్పు తేల్చేస్తానూ..." అంటూ హామీ ఇచ్చేడు.

"ఏటున్నాదన్నియా... మాయమ్మి రత్నపాపనేదూ... దానికి మొన్న వింజనీరు సమ్మందమొచ్చినాదుగాదా... మెట్రిక్కు పేసయ్యేటట్టు సూడు మేస్టూ... అని ఆనాడు బతిమల్లాపడ్డాం... నిజవే... ఇదిగో లెంపలేసుకుంటన్నాను..." అని ఫెడీ ఫెడీ మని చెంపల మీద కొట్టుకుంది పాపమ్మ. "అవుతే మాత్రం... సులకనయిపోనాదా... ఊళ్ళో అంతో ఇంతో మోతుబర్లం... మా పిల్లకే పేవా దోవా అంటూ కబుర్లు సెప్తాడా మేస్టు... ఏటన్నియ్యా మాటాడవేటి..." అని ప్రెసిడెంటుని పొడిచింది పాపమ్మ.

"నివ్వుండప్పా..." అంటూ చేత్తో ఆపుకుని "నిజవేనేంటయ్యా మేస్టూ...?" అంటూ అడిగేడు ప్రెసిడెంటు.

తలదించుకుని ఆలోచించేన్నేను.

రత్నకుమారి బావుంటుంది.రోజా ట్యూషనుకు వచ్చేది. ట్యూషనుకు వస్తూ గురువుగారికి పండో కాయో తెచ్చిచ్చేది. ఇవ్వడమంటే అందరూ ఇస్తారు కాని తినే వరకూ వూరుకోకపోవడం... ఇది ఏ లక్షణమని ఏ కుర్రవయసువాడైనా అనుకుంటాడు?

ఉపాధ్యాయవృత్తి అనేది పూర్వకాలంనాటి గురువుల వృత్తి కాదు. కేవలం ఒక ఉద్యోగం. ప్రభుత్వ రంగ పరిశ్రమలో కండలు కరిగించి ఉత్పత్తిని పెంచి ప్రభుత్వపరంచేసి జీతంరాళ్ళు తీసుకునే కార్మికుడి లాటివాడే ఉపాధ్యాయుడు. గురువుకీ, ఉపాధ్యాయుడికీ బోలెడు వ్యత్యాసం ఉన్నప్పటికీ అది గమనించరు.

మనిషికుండే బలహీనతలు అతనికీ ఉంటాయి. అప్పటి గురువు యొక్క సామాజిక అంతస్తును బట్టి అడిగే పరిస్థితి రాలేదు. ఇప్పుడు అడగడమేవిటీ ఇలా తిడుతున్నారు.

అడగడానికీ, తిట్టడానికీ నేనంటే నేను. మీదిమీదికొచ్చే ఆ అమ్మాయిని చేత్తో అంటనైనా అంటకుండా ప్రేమని వ్యక్తం చేసేను. పెళ్ళి చేసుకుంటానని చెప్పేను.

వయసుకి కుర్రాళ్లయినా బూజుపట్టిన భావాల్తో వరకట్నాలు గుంజుకునే వాళ్ళకి భిన్నంగా అభ్యుదయ భావంతో మనసువిప్పేను. అటువంటి వాడిని తిరిగి వాళ్ళ డబ్బూ దస్కం దోచుకునేవాడిగా దుమ్మెత్తి పోస్తున్నారు.

అయితే ఇప్పటికీ నా మనసు మారలేదు. మారదు. తల్లిదండ్రులెటువంటి వాళ్ళయినప్పటికీ ఆ అమ్మాయిని నేను చేసుకుని నా మానాన నేను బతికేస్తాను... ఆ అమ్మాయి ఇష్టపడితే...

ఈ నా ఆలోచనలన్నీ హారంగా గుచ్చి వాళ్ళ ముందుంచేను.

"బావుందయ్యా మేస్టూ... మా మంచి కత సెప్పేవుగానీ... సర్లే నీ మాట అబద్దవని నానెందుకు సెప్పాల... ఆ రత్నపాపనే అడిగేద్దారి..." అన్నాడు ప్రెసిడెంటు.

"దాన్నేటడుగుతా వన్నియ్యా..." అంటూ పాపమ్మా...

"రాజుగార్తో సెప్పుకుంటే మర్రెండెయ్యి మన్నాట్ట... మా బాగుందెవ్వారం..." అంటూ పాపమ్మ మొగుడూ అడ్డుచెప్తున్నా... రత్నపాపని పిల్చుకు రావడానికి వెళ్ళేడు ప్రెసిడెంటు.

నాకు ఉపకారం చెయ్యడానికే వెళ్ళేడో... అక్కడ ఉపదేశం చెయ్యడానికే వెళ్ళేడో....

"అమ్మా అంతా అబద్దాలేనే... అన్నీ పాడుమాటలు చెప్పేవోడే..." ఏడుపుగొంతు వినిపించింది లోపల్నుండి.అది రత్నపాపదే! సాగదీసి పలుకుతూ

ఉంటే సానపెట్టిన పలుగును గుండెల్లో దించినట్లన్పించింది.

దానికితోడు ప్రెసిడెంటు ఉపన్యాసం మొదలెట్టేడు. "గురుద్దేవో మయ్యేస్సరా అంటారు గదా... ఏటి మేస్ట్రూ నువ్వు సెయ్యవొల్సిన పనేనా...?"

మరింకేం నాకు విన్పించలేదు. తలెత్తి ఎవరిపక్కా చూడలేకపోయేను.

అన్ని మాటలు పడ్డాక ఆ వూళ్ళోనే సిగ్గూ లజ్జా వదిలేసి బతకడానికి నేనేం రాజకీయ నాయకుణ్ణి కాదు.

అంత అవమానం పాలయ్యేక కక్ష తీర్చుకోవడాకీ, అక్కడే వుండి సాధించడానికీ నేనేం సినిమా హీరోని కాదు.

రాజకీయ నాయకులకన్నివిధాలా ఉపయోగపడినా, అవసరం తీరేసరికి ఏరిపారేయబడిన కరివేపాకుని. రాజకీయంగా గురుసాక్షాత్ పరబ్రహ్మ అని పొగడబడినప్పటికీ వ్యావహారికంగా "ఏటిగురూ?...' అనిపించుకుంటున్నవాణ్ణి.

అంచేత ముందుగా ఓ నెల మెడికల్ లీవు పెట్టేసి జిల్లాపరిషత్‌లో బదిలీకి కాయితం పెట్టేసుకున్నాను.

ఇదిగో ముప్పయ్ మైళ్ళు బస్సులో ప్రయాణం చేసి మూడు మైళ్ళు నడిస్తేగాని రాని వూరుకి ట్రాన్సఫరయ్యింది.

అడుగులు లెక్క పెట్టుకుంటూ తార్రోడ్డుమీద నడుస్తూంటే అడుగడుగునా గుర్తువస్తున్న గతాన్ని వెనక్కు తోసేస్తూ ముందుకు చూసేను.

వూరి పొలిమేరలో ఉన్నాను.

రగడ చేసే రచ్చబండలూ, గతుకు బతుకుల బాటలూ, మూఢాచారాల మనుషులూ... ఇవన్నీ దూరంగా చూస్తుంటే అంతా ఎక్కడో చూసినట్టుగానూ, తెలిసిన పరిసరాల్లాగానూ అనిపిస్తోంది.

అవును.

నేను వదిలి వస్తున్న ఊరూ, ఆ వూళ్ళోని మనుషులూ... గుర్తొస్తున్నారు.

ఈ ఊరే కాదు, దేశంలోని ఏ పల్లె అయినా ఇంతకంటే భిన్నంగా ఉండదు.

మరంచేత పారిపోయేందుకు ప్రయత్నించక, నిలబడి ఎదుర్కోవలసిన అవసరం ఎంతైనా ఉంది... అనుకుంటూ వూళ్ళోకి ధైర్యంగా అడుగుపెట్టేను.

(పల్లకి, సచిత్రవారపత్రిక, 24-1-1985)